
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 7 జూలై 2024





- పారిశుధ్య లోపంతో విజృంభిస్తున్న దోమలు
- వాతావరణ మార్పులతో పెరుగుతున్న జ్వర పీడితులు
- జిల్లాలో ఇప్పుడిప్పుడే నమోదవుతున్న కేసులు
- ఇష్టారీతిగా దండుకుంటున్న ప్రైవేటు ఆసుపత్రులు

డెంగీ బెల్స్

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల డెంగీ జ్వరంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వార్షలకు వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. డెంగీ లక్షణాలతో రోగులు ఆసుపత్రులకు వస్తున్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా వ్యాపించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా డెంగ్యూ వైరల్ ఫీవర్‌లు విజృంభిస్తున్నాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా జ్వరం బారిన పడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి వంటి పట్టణాలు, ఇతర ప్రాంతాల్లోని పలు ప్రైవేటు ఆసుపత్రులు డెంగీ బూచి చూపించి అడ్డగోలుగా రోగుల నుంచి దోచుకుం టున్నారు. జ్వరంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే చాలు...వెంటనే వివిధ రకాల టెస్టులు చేయిస్తూ వైరల్..వైరల్ డెంగీ పేరుతో భయ భ్రాంతులకు గురి చేస్తూ రోగులను అడ్మిట్ చేసుకుని వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు.

ల్యాబ్ పరీక్షల పేరిట ఫీజులు...

జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆసుపత్రుల్లో డెంగీ టెస్ట్‌లు చేయడానికి అవకాశం లేదు. ఇందుకు సంబంధిత పరికరాలు అందుబాటులో లేవు. జ్వరంతో వచ్చిన రోగులకు కేవలం ఎన్ఎస్-1 కిట్‌తో టెస్ట్‌లు చేసి డెంగీ పాజిటివ్ వచ్చిందని, రక్తకణాలు తగ్గుతున్నాయని భయపెట్టి మరీ రోగు లకు అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నారు. రూ. వేలల్లో ఫీజులు అక్రమంగా దండుకుంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో కనీసం ఒక్క పరికరం లేకుండా డెంగీ అని చెప్పుతుండడం పట్ల అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యం...

జిల్లాలో సుమారు 263 ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. ఇందులో జగిత్యాల డివిజన్‌లో 168 ఆసుపత్రులు, కోరుట్ల డివిజన్‌లో 45 ఆసుపత్రులు, మెట్‌పల్లి డివిజన్‌లో 50 ఆసుపత్రులున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. జ్వరం వస్తే చాలు ప్రైవేటు ఆసుపత్రులు అడ్మిట్ చేసుకుని అనంతరం డెంగీ పేరుతో ఒక్కోరోగి వద్ద రూ. 40 వేల నుంచి 60 వేల వరకు వసూలు చేస్తున్నారు, ప్రతి రోజూ ఒక్కో ఆసుపత్రికి 40 నుంచి 60 మందికి పైగా రోగులు చూపించు కోవడానికి వస్తున్నారు. ఇందులో రోజుకు 4 నుంచి 8 మందిని అడ్మిట్ చేసుకుంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల సంబంధించి ల్యాబ్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎన్ఎస్-1 కిట్‌తో టెస్ట్‌లు చేసి అడ్మిట్ చేసుకుంటున్నారు.

టీ హబ్‌లోనే ఎలీసా టెస్ట్ సౌకర్యం...

జిల్లాలో ప్రయివేటు ఆసుపత్రిలో డెంగీ పేరుతో ల్యాబ్‌లలో పరీక్షలు చేసే అవకాశాలు లేవు. డెంగీ నిర్ధారణకు జరిపే ఎలీసా టెస్ట్ కేవలం జిల్లా కేంద్రంలోని టీ హబ్‌లోనే అందుబాటులో ఉంది. డెంగీ టెస్ట్ కేవలం టీ-హబ్‌లో మాత్రమే చేసి నిర్ధారణ చేస్తారు. కొందరు ప్రయివేటు ఆసుప త్రుల నిర్వాహకులు ఎన్ఎస్ -1 కిట్‌తో టెస్ట్ చేసి డెంగీ పాజిటివ్ అని నిబంధనలకు విరుద్ధంగా నిర్ధారిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే మేలు...

పల్లెలు, పట్టణాల్లో రోగాలు వ్యాపించకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. సుమారు గత పక్షం రోజులుగా పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం, ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేస్తుం డడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు గానీ, మురుగు నీరు గానీ నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. వాడిపాడేసిన టైర్లు, కొబ్బరి బోండాలు, కుండీలు, పూల కుండీలు, డ్రమ్ములు, పాత పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రచారం చేస్తున్నారు. ప్రజలు చైతన్యవంతులై ముం దస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని వైద్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఎలిసా టెస్ట్ లేకుండా నిర్ధారిస్తే చర్యలు తప్పవు
డాక్టర్ సమియోద్దిన్, డీఎంహెచ్‌వో.



పలు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చ ర్యలు తప్పవు. డెంగీ రోగ నిర్ధారణకు అవసరమైన ఎలిసా టెస్ట్ లేకుండా ప్రకటించకూడదు. ఎలిసా టెస్టు కేవలం జిల్లా కేంద్రంలోని టీ హబ్‌లోనే అందుబాటులో ఉంది. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీతో రోగ నిర్ధారణ చేసే అవకాశాలు లేవు. ఆసుపత్రుల నిర్వాహకులు నిబం ధనలు పాటించాలి.

పెరుగుతున్న కేసులు...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో డెంగీ కేసులు క్రమంగా నమోదు అవుతున్నాయి. జిల్లాలో 2019 సంవత్సరంలో 128 డెంగీ కేసులు నమోదు కాగా, 2020లో 5 కేసులు, 2021లో 98 కేసులు, 2022లో 309 కేసులు, 2023లో 110 కేసులు నమోదు అయ్యాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 4 కేసులు నమోదయ్యాయి. దీంతో జిల్లాలోని పలు ప్రాంతా ల్లో ఉన్న పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్‌సెంటర్‌లు, ఏరీయా, జిల్లా ఆసు పత్రులతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రులలో చేరే జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

ప్రైవేటులో అవకాశం లేదు..

జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆసుపత్రుల్లో డెంగీ టెస్ట్‌లు చేయడానికి అవకాశం లేదు. ఇందుకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవు, జ్వరంతో వచ్చిన రోగులకు కేవలం ఎస్ఎస్ -1 కిట్‌తో టెస్ట్‌లు చేసి డెంగీ పాజిటివ్ వచ్చిందని, రక్తకణాలు తగ్గుతున్నాయని భయపెట్టి మరీ రోగు లకు అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నారు. రూ. వేలల్లో ఫీజులు అక్రమంగా దండుకుంటున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో కనీసం ఒక్క పరికరం కూడా లేకుండా డెంగీ అని నిర్ధారిస్తుండడం పట్ల పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు



జగిత్యాలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

జగిత్యాల టౌన్, జూలై 6: జిల్లా కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోతే రోడ్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో యు వజన నాయకులు కత్తురోజు గిరి, శరత్ రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి, మాతా శిశు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా, రోటరీ క్లబ్, ఆపీ ప్రివెంటివ్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మంచాల కృష్ణ, నాయకులు ప్రవీణ్‌రావు, సుమన్‌రావు, ఆరీఫ్, మహేష్, రాకేష్, శ్రీను, బిక్షపతి, క్రాంతి, శేఖర్, రాజు, రవి శంకర్ ఉన్నారు.

బీర్‌పూర్: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా శనివారం బీర్‌పూర్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారపాక రమేష్, మహిపాల్‌రెడ్డి, రామచంద్రం, రామకిష్టు గంగాధర్, నరేందర్, మారుతి, రమేష్, ఏసుదాసు, జక్కినపెల్లి శ్రీనివాస్, హరీష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. పాత బస్టాండ్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు కోల శ్రీనివాస్, నాని, మహేందర్ బాబు, అచ్యుత రావు, ఇర్ఫాన్, శ్రీనివాస్ గౌడ్, గంప ఆనందం పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



సీఎంతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ శనివారం హైద్రాబాద్ లోని సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. జగిత్యాల సమగ్ర అభివృద్ధికి సహకరిస్తానని సీఎం హామీనిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వృద్ధుల పోషణ బాధ్యత విస్మరిస్తే చర్యలు

జగిత్యాల ఆర్డీవో మధుసూధన్

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, విస్మరిస్తే చర్యలు తప్పవని జగిత్యాల ఆర్డీవో మదుసూదన్ అన్నారు. శనివారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలు అయిన పలు కేసులను ఆయన విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించకుండా నిర్లక్ష్యంచేస్తే పిల్లలకు 2007 సంరక్షణ చట్టం సెక్షన్ 24 ప్రకారం 6 నెలల వరకు జైలు శిక్షతో పాటు జరిమాన విధించే వీలుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, ప్రతినిధులు ప్రకాశ్‌రావు, కండ్లే గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ పద్మజ, ఫీల్డ్ అధికారి కొండయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. శనివారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలపడంతో పాటు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

యువత భవిష్యత్తు పాడు చేసుకోవద్దు

- ఎస్పీ అశోక్ కుమార్..
- మూఢ నమ్మకాలపై అవగాహన



మూఢ నమ్మకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

బీర్‌పూర్, జూలై 6: నేటి యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో మూఢ నమ్మకాలపై పోలీస్ బృందాలచే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువత గంజాయికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోకుండ ఆరోగ్యంగా ఉండి ఉన్నతమైన చదువులు చదవి ఉద్యోగాలు సాధించాలన్నారు. మారు మూల ప్రాంతాలలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు చాల మంది బలవుతున్నారని, ఎవరైనా గల్ఫ్ వెళ్లాలంటే లైసెన్స్ ఉన్న ఏజెంట్ల వద్దకు వెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో మూఢ నమ్మకాలను నమ్మి బంధుత్వాలను దూరం చేసుకుంటారని అలాంటి మాయ మాటలు నమ్మి మంత్రాలు తంత్రాలు ఉన్నాయని మోసపో వద్దని ప్రజలను కోరారు. అంత భూటక మేనని ప్రజలకు పోలీస్ కళా బృందాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని అయినా ఇంకా కూడా గ్రామాలలో చైతన్యం రావడం లేదన్నారు. అనంతరం బీర్‌పూర్ మండలానికి నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కుమార స్వామిని సన్మానించారు, గ్రామంలోని యువత పెడు దారిన పోకుండ ఉండేందుకు క్రీడలపై దృష్టి సారించేలా యువకులకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందన్, జగిత్యాల రూరల్ సీఐ క్రిష్ణ రెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, మాజీ సర్పంచ్ చుంచు శారద నరేందర్, పోలీస్ కళాబృందాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి సన్నిధిలో ఎస్పీ పూజలు

బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్పీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి ఆశిర్వచనాలను అందించారు. ఈ కార్యక్రంలో డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల రూరల్ సీఐ క్రిష్ణ రెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమార స్వామి, సిబ్బంది ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణలో అన్ని వర్గాలు భాగస్వామ్యం కావాల్సిన అవసరముందని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శని వారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మీ, సభ్యులు కోట శివ కుమార్, కొండ్ర రాజు కుమార్, ఓటరీకారి శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. జిల్లాలో పిల్లల జీవనశైలి, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్న విషయాల గురించి చర్చించారు.

సాగులో ఉన్న భూములకే రైతు భరోసా

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జూలై, 6 : గత ప్రభుత్వ హయంలో మాదిరిగా నిధులు దుర్వినియోగం కాకుండా సాగులో ఉన్న భూములకే ప్రభుత్వం రైతు భరోసా అందజేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలం లోని అర్పపల్లి ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ముందుగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హమీ ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5 ఎకరాలు ఉన్న రైతులకు మాత్రమే వర్తింప చేయాలని రైతుల నుంచి అభిప్రాయాలు వస్తున్న నేపథ్యంలో అయిదు ఎకరాల వరకే రైతు భరోసా అందజేసేల ప్రభుత్వం చర్యలు చేపడు తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, రుణ మాఫీ, రైతు భరోసా, పంటల బీమా పథకం వంటి పథకాలు అమలు చేస్తుందని బీజేపీ పాలిత రాష్ట్రాలో అమలు కావడం లేదన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కల ఎంపిక ప్రధానమని ఈ విషయంపై సీఎం దృష్టికి తీసు కెళ్తానన్నారు. ఈ పంట నుంచి సన్న రకం సాగు చేసే రైతులకు రూ, 500ల బోనస్ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలు, మాజీ సర్పంచ్ బేతి పూర్ణ చందర్‌రెడ్డి, నాయకులు ఆకుల రాజిరెడ్డి, రవి, స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు ఉత్సవం



గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జగిత్యాల అర్బన్, జూలై 6: పట్టణంలోని జ్యోతి బిల్డింగ్ బ్లాక్స్ ప్లే స్కూల్‌లో ఆషాడ మాసం పురస్కరించుకొని శనివారం నిర్వహించిన గోరింటాకు వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాలలో చిన్నారులు చేతులకు అందంగా గోరింటాకు అలంకరించుకున్నారు. పాఠశాలలో గోరింటాను సిద్ధం చేసుకొని అలంకరించుకోవడం వంటివి జరిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో గందరగోళం

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ దృష్టి
- మార్పు బాటలో మరికొందరు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇంతకాలం అధికారాన్ని అనుభవించి ఆ అధికారం చేజారగానే కాంగ్రెస్‌లో చేరేందుకు నేతలు వరుస కడుతుండడం బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా వర్గాల్లో కలవరం రేపుతున్నది. వారంరోజుల క్రితం ఒక ఎమ్మెల్యే, ని న్న ఒక ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పు కోవడంతో తరువాత ఎవరు పార్టీ మారనున్నారో, ఇంకెవరె వరు వరుసలో ఉన్నారో అంటూ చర్చలు జరుగుతున్నాయి. దీంతో ఆ పార్టీశ్రేణులు గందరగోళంలో పడిపో వడమే కాకుండా పార్టీ పరిస్థితి ఏమిటీ అంటూ చర్చించుకుంటున్నారు.



● ఇప్పటికే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ..

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల బీఆర్‌ఎస్ శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్ కుమార్ ఇటీవల పార్టీకి రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి సమ క్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గురువారం అర్ధరాత్రి పెద్దపల్లికి చెందిన ఎమ్మెల్సీ టి భానుప్రసాద్‌రావు కాంగ్రెస్ బాటపట్టారు. జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు మరెవరూ లేకపోయినా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు మరికొందరు ఉన్నారు. వారిలో కొందరిపై పార్టీ మారే అవకాశాలున్నా యంటూ చర్చలు జరుగు తున్నాయి. బీఆర్‌ఎస్ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీరామారావు సిరిసిల్ల శాసన సభ్యుడిగా గెలుపొందగా, మాజీ మంత్రి, గంగుల కమలాకర్ కరీం నగర్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. హుజూరాబాద్ నుంచి పాడి కౌశికౌరెడ్డి గెలుపొందారు. కోరుట్ల నుంచి డాక్టర్ సంజయ్ కూడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

● నెక్స్ ఎవరు?

జగిత్యాల నుంచి గెలిచిన సంజయ్‌కుమార్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. కేటీ రామారావు సన్నిహిత మిత్రుడైన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీ మారే అవకాశం ఉండక పోవచ్చని భావిస్తున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నదని ఎన్నికలు జరిగిన నెలరో జుల నుంచే చర్చించుకోవడం ప్రారంభమైంది. సీఎం రేవంత్‌రెడ్డికి గంగుల కమలాకర్‌కు టీడీపీ హయాం నుంచి సన్నిహిత సంబంధాలున్నాయని, వారిద్దరు తరచుగా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటారని ప్రచారంలో ఉంది. పాడి కౌశిక్ రెడ్డి సమీపబంధువైన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్ మంత్రి వర్గంలో కీలకమైన వ్యక్తిగా ఉండడం, గతంలో పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉండడం, హుజూరాబాద్ నుంచి పోటీచేసిన నేపథ్యం ఉండడంతో ఆయన కూడా కాంగ్రెస్‌కు వెళ్తారంటూ ప్రచారం జరిగింది. వీరిద్దరూ ఆ ప్రచారాన్ని ఖండిస్తూ పార్టీ మారేది లేదని చెప్పినా ఇంకా చర్చకు మాత్రం తెరపడ డం లేదు. పాడి కౌశిక్‌రెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా తన నియో జకవర్గంలో పార్టీ ఉనికి కోసం, తన ఉనికికోసం ఏదో ఒక ప్రయత్నం చేస్తూ చర్చల్లో ఉంటున్నారు. దీంతో ఆయన బీఆర్‌ఎస్‌కు వీడక పోవచ్చని అందరూ భావిస్తున్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ నుంచి పార్టీ మారేది లేదంటూ బలమైన ప్రకటన కానీ, ఆచరణకాని వ్యక్తం కాకపోవడంతో ఇంకా అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి.



ధ్వంసమైన డ్రైనేజీ

- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

జమ్మికుంట, జూలై 6: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి పాత కూరగాయాల మార్కెట్ వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైనేజీ పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు ఇరుకుగా మారడంతో అటువైపు వెళ్లే వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.. ఎఫ్‌సీఐ, నూతన వ్యవసాయ మార్కెట్, రైస్ మిల్లులకు ఈ రోడ్డు నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అధిక లోడుతో వచ్చే భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకు వెళ్లే ట్రాలీలు, ఇసుక ట్రాక్టర్ల రాక పోకలతో రోడ్డు మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. వీటికి తోడు చికెన్ సెంటర్లు, ఎగ్ సెంటర్లు, కిరాణ షాపులు అటువైపు ఎక్కువగా ఉన్నాయి. కోరపల్లి, విలాసాగర్, బిజిగిరిషరీఫ్, పోతిరెడ్డిపల్లి, కొండపాక గ్రామాలకు ఈ ప్రాంతం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణంగానే కూరగాయాల మార్కెట్ రోడ్డు ఇరుకుగా ఉటుంది. దీనికితోడు కాల్వ ధ్వంసం కావడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చిన సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో ధ్వంసమైన డ్రైనేజీ

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

- జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ

హుజూరాబాద్, జూలై 6: విద్యార్థులు నేరాల వైపుకి వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టాలని హుజూరాబాద్ కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నూతన శిక్ష చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి పద్మ సాయిశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇటీవలే నూతనంగా వచ్చిన శిక్ష చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. యువత లక్ష్యం ఏర్పారుచుకొని సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, మహిళ సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీలత, ఫైనాన్షియల్ లిట్రసి రోహిణి, సఖి లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబుల్ రోడ్డు పనులు


గునుకుల కొండాపూర్ వరకు చేపడుతున్న రోడ్డు పనులు

గన్నేరువరం, జూలై 6: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు 71 కోట్ల రూపాయలతో మంజూరైన డబుల్ రోడ్డు పనులు ఎట్టకేలకు కొన సాగుతున్నాయి. మొత్తం 21కిలోమీటర్ల మేర 33ఫీట్ల తారు రోడ్డు వేయనున్నారు. ప్రస్తుతం గునుకుల కొండాపూర్ వరకు వరకు రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు. గన్నేరువరం మండలంగా ఏర్పాటు కాకముందు ఈ రో డ్డుపై వాహనాలు పెద్దగా వెళ్లేవి కావు. ప్రస్తుతం మండలంగా ఏర్పడ్డ గన్నేరువరం నుంచి వాహనాల రాకపోకలు పెరిగాయి. ఇటీవలి వరకు రోడ్డుపై గుంతలు ఉండడంతో వాహనదా రులు ఇబ్బందులు పడ్డారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు.

కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు

రామడుగు, జూలై 6: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. పల్లె ప్రకృతి వనంలోని ఫెన్సింగ్‌ను తొలగించారని తెలిపారు. తిరిగి శనివారం గ్రామపంచాయతీ సిబ్బందితో కంచెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాటిన చోటే మళ్లీ గుంతలు

- మొక్కలు పెట్టి సంరక్షణ మరిచిన అధికారులు


చిగురుమామిడి గ్రామ శివారులో తీసిన గుంతలు

చిగురుమామిడి, జూలై 6: మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం హయాంలో హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో మొక్కలు ఎండిపోయాయి. ఈ ఏడాది మళ్లీ ఆ ప్రాంతాల్లోనే మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తుండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శివారులో ఉన్న పామ్‌బండ వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అట్టహాసంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా 2015 ఆగస్టులో మొక్కలు నాటారు. అధికారులు పట్టించుకోక పోవడంతో అన్ని మొక్కలు ఎండి పోయాయి. దీంతో లక్షలాది రూపాయలు ప్రజల సొమ్ము వృథా అయిందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది మళ్లీ అధికారులు విధించిన లక్ష్యం చేరుకునేందుకు ఆ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 53,900 మొక్కలు నాటాల్సి ఉంది.. దీని కోసం అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల చేత గుంతలు తీసి సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటి సంరక్షణకు కంచేలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి

జమ్మికుంట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమ య్యాయి. ప్రిన్సిపాల్‌గా జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్ వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం రోజు రోజుకు పెరిగి పోతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన మ్యాజిక్ ఫిగర్ రాలేదన్నారు. 400సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు సవరిస్తామని చెప్పిన మాటలను ప్రజలు తిరస్కరించి 240సీట్లకు పరిమితం చేశారని చెప్పారు.. ఎన్డీఏ పక్షాలను కలుపుకొని నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. ఇది పూర్తి కాలం నిలబడే ప్రభుత్వం కాదన్నారు. బీజేపీ ఒంటెత్తు పోకడలను మిత్ర పక్షాలు భరించలేక ఏ క్షణంలో అయిన వైదొలిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని, నేరుగా సింగరేణికి కేటాయించాలని కోరారు. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 200బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని తెలిపారు. సమావేశంలో వెలమరెడ్డి రాజిరెడ్డి, కొప్పుల శంకర్, బాసిర నందప్‌రావు, దండిగారి సతీష్, చెల్పూరి రాములు, వద్లూరి కిషోర్, రాజు, వసుదేవ్, రమేశ్, రాజకుమారి, మధునయ్యా, వెంకన్న పాల్గొన్నారు.







సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

జమ్మికుంట, జూలై 6: సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సామాజిక శాస్త్రాల జ్ఞానశాస్త్రం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం పుట్టుక, స్వభావం, పరిమితులు, వాస్తవాలు, విలువలకు మధ్య ఉండే వైరుధ్యాలు, సామాజిక శాస్త్రాల పాత్ర అంశాలపై వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రెంచ్ విప్లవం ద్వారా సమాజానికి పరిచయం అయ్యాయన్నారు. సామాజిక శాస్త్రాలు విలువలకు ప్రాధాన్యం ఇస్తే, సైన్స్ వాస్తావాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇవి ఎప్పుడు మారుతుంటాయని, అందుకే సామాజిక శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేయవల్సిన అవసరం ఉందని చెప్పారు.. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ రామమోహన్‌రావు, అధ్యాపకులు బి మహేందర్‌రావు, డాక్టర్ టి శ్రీలత, పిడి సుజాత, ఆర్ ఈశ్వరయ్య, వి స్వరూపరాణి, పి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రవిందర్, డాక్టర్ రవి ప్రకాష్, డాక్టర్ సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 6: అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని ఎన్‌ఐటీ వరంగల్ ప్రొఫెసర్ వేణు వినోద్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన క్వాలిటి ఎం హాన్సమెంట్ ఇన్ టెక్నికల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అవసరమైన ప్రయోగాలు చేసేలా అధ్యాపకులు తర్ఫీదులు చేయాలన్నారు. శాస్త్రీయ సాంకేతిక జర్నల్స్‌లో మంచి నాణ్యమైన పరిశోధన పత్రాలు సమర్పించాలని, అప్పుడే మాత్రమే విద్యార్థులకు సరైన ఆదునిక పరిజ్ఞానం అందు ుందన్నారు. ప్రశ్నపత్రం తయారిలో, ముల్యాం కనంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఐసి డీన్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వి సతీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

జమ్మికుంట రూరల్, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి విష్ణు అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న బోజనం పథకానికి నిధులు కేటాయించి విద్యార్థులకు మంచి పౌష్ఠికాహారం అందజేయాలన్నారు. ఉపాధ్యాయ, అటెండర్, స్కావెంజర్, పీటీ, టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇల్లందుల శ్రీనాథ్, మొలుగూరి వినయ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వినతి

చిగురుమామిడి, జూలై 6: మండలంలోని 17 గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతీ రోజు సుమారు 80 నుంచి 90 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తు న్న పరిస్థితి నెలకొంది. పలు గ్రామల్లో ప్రజలు దగ్గు, జ్వరం, జలుబుతో ఇబ్బందులు పడు తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎలాంటి పరీక్షలు చేయకుండా సిబ్బంది కేవలం మందులు ఇస్తూ సరిపెడుతున్నారని పలువురు వాపోయారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి..

వైద్యాధికారులు సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. రోగులకు సరిపడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ అదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆస్పత్రిలో ఉండి చికిత్స అందించాలి.

- సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి

ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జూలై 6: ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ శనివారం విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాలను www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రూ. 31.81లక్షల సైబర్ మోసం

సిరిసిల్ల క్రైం, జూలై 6: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో రూ. 31.81లక్షలు సైబర్ మోసానికి గురైనట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబరు 1930కి ఫోన్‌చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిరిసిల్లలో క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ పేరిట రూ.2.62లక్షలు, వేములవాడ టౌన్‌లోనూ ట్రేడింగ్ పేరిట రూ.28.75లక్షలు, ముస్తాబాద్‌లో ద్విచక్రవాహనం తక్కువ ధరకే ఇస్తామని నమ్మించి రూ.44, 500 కాజేశారని వివరించారు. ప్రజలు మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

గోదావరిఖనిలో పోలీసుల తనిఖీలు

● మత్తు పదార్థాల కట్టడికి నార్కోటిక్ శిక్షణ డాగ్స్ వినియోగం

కోల్‌సిటీ, జూలై 6: గోదావరిఖని ఇందిరానగర్‌లో శనివారం తెల్లవారుజామున వన్‌టౌన్ పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ ఎంరమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది కాలనీలోని ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొదటి సారిగా నార్కోటిక్ డాగ్స్‌ను వినియోగించారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి జాడ తెలుసుకునేందుకు వీటిని వినియోగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కొత్త వ్యక్తులు, నేరస్థులు కాలనీల్లో షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మెసేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఏమైనా



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, 100నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి గృహపత్రాలు కలిగి ఉండాలని, స్వీయ రక్షణ కోసం హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్-2 ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి, ఎస్ఐలు సమ్మయ్య, శ్రీనివాస్, సుగుణాకర్, గోదావరిఖని టుటౌన్ ఎస్ఐలు సనత్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల ఆస్తి తగాదా

● తల్లిని రోడ్డుకు ఈడ్చిన కొడుకులు

సిరిసిల్ల టౌన్, జూలై 6: సొంత అన్నదమ్ముల ఆస్తి తగాదా తొమ్మిది నెలలు మోసి కని పెంచిన తల్లిని రోడ్డున పడేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన స్థానికులను కలిచివేసింది. బాధితురాలి కథనం ప్రకా రం.. రాజన్న



సామగ్రితో ఇంటిబయట తల్లి శకుంతల

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన యెలిగేటి శకుంతల లక్ష్మీనారాయణ దంపతులకు ముగ్గురు కొడుకులు దామోదర్, రామానుజం, చంద్రశేఖర్. అష్టకష్టాలు పడి పెంచారు. భర్త లక్ష్మీనారాయణ రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అనంతరం పెద్ద మనుషుల సమక్షంలో ఉన్న ఇంటిని ముగ్గురు కొడుకులకు మూడు భాగాలు చేసి అందులోనే ఒక గదిలో శంకుతల ఒంటరిగా ఉంటోంది. ముగ్గురు కొడుకుల్లో రెండో కుమారుడు రామానుజం వ్యాపారంలో నష్టం రావడంతో ఇంటిలోని తన భాగాన్ని ఇద్దరు సోదరులకు ధర కట్టి ఇచ్చాడు. కొన్ని డబ్బులు ఇవ్వడంతో అప్పులు కట్టుకొని వేరే ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. రెండో కుమారుడు రామానుజంకు మొత్తం డబ్బులు రాకపోవడంతో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయలేదు. రామానుజంకు చెప్పి రిజిస్ట్రేషన్ చేయించాలని తల్లి శకుంతలను పెద్ద కొడుకు దామోదరం, చిన్న కొడుకు చంద్రశేఖర్ ఏడు నెలల క్రితం బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో శకుంతల అక్కడే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంది. ఇటీవల శకుంతల అస్వస్థతకు గురవడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో తన సొంత ఇంట్లోనే ఉంటానని సామగ్రితో శనివారం తిరిగి వచ్చింది. ఇద్దరు కొడుకులు ఇంట్లోకి రాకుండా ఇంటికి తాళం వేయడంతో ఆ తల్లి సామగ్రితో సహా నిరీక్షించింది. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

సింగరేణిలో 272పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు

● ఈ నెల 20, 21తేదీల్లో రాత పరీక్ష

గోదావరిఖని, జూలై 6: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో ఆయా విభాగాలలో ఖాళీగా ఉన్న 10కేటగిరీలలో గల 272పోస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ఏ), మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో జియాలజిస్ట్), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, సబ్ ఓవర్సీస్ ట్రైనీ పోస్టులను ప్రత్యక్ష నియామకాల (ఎక్స్‌టర్నల్) పద్ధతిలో భర్తీ చేయడానికి ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ నెంబర్ 01/2024 ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20,21తేదీల్లో హైదరాబాద్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. అభ్యర్థులు సింగరేణి సంస్థ వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డ్/హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అభ్యర్థుల మెయిల్ ఐడికి కూడా డౌన్లోడ్ చేసుకోవటానికి లింక్ పంపించడం జరిగిందని యాజమాన్యం తెలిపింది. పరీక్ష తేదీ, సమయం, సెంటర్ పేరు హాల్ టికెట్ నందు పోస్టులవారీగా పొందుపరిచామని జీఎం(సెక్యూరిటీ), జీఎం(పర్సనల్) వెల్ఫేర్ , ఆర్‌సీ బీఆర్ దీక్షితులు తెలిపారు. పోస్టులన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ద్వారా పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులను నమ్మి ఎవరూ మోస పోవద్దని, ఎవరైనా సామాజిక మాధ్యమాలలో మెసేజ్, ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే ప్రలోభాలకు గురికాకుండా సింగరేణి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయాలన్నారు. అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం పేర్కొన్నారని వారు తెలిపారు.

కుక్క దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 6: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో శనివారం కుక్క దాడిలో అదే గ్రామానికి చెందిన ఇల్లెందుల రాజిరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న కుక్క వెంబడించి గాయపరిచింది. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని ప్రజలు పేర్కొంటున్నారు. పది రోజుల కిందట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న ఐదుగురు విద్యార్థులపై దాడి చేశాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టులోకి 1,736 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 11.545 టీఎంసీల నీరు నిల్వఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.405 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.840 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

భూవివాదంలో యువకుడి ఆత్మహత్య

ఓదెల, జూలై 6: మండలంలోని జీలకుంటలో వంగల శ్రీకాంత్‌రెడ్డి(36) అనే యువకుడు శనివారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్థులు తెలిపారు. రెండేళ్ల క్రితం శ్రీకాంత్‌రెడ్డి భూమి విషయమై వివాదం ఏర్పడిందని, అప్పటి నుంచి తన భూమి తనకు దక్కుతుందో, లేదో అనే మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆత్మహత్య విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఒకరిపై దాడి ఘటనలో ఇద్దరి అరెస్టు

చందుర్తి, జూలై 6 : ఒకరిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మండలంలోని లింగంపేట గ్రామంలో మల్యాల రవిపై జూన్ 27న ఇదే గ్రామానికి చెందిన మంద గణేష్, కట్కూరి అక్షయ్ లు బీరు సీసా, కర్రలతో దాడికి పాల్పడ్డారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి గణేష్, అక్షయ్‌లను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 6: సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న చిత్తారి రత్నం(52) నోటి నుంచి నురుగులు కక్కుతుండగా శుక్రవారం రాత్రి 11 గంటలకు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. శంకరపట్నం మండలం గద్దెపాకకు చెందిన రత్నం సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటూ విద్యుత్‌స్థంభాల సబ్‌కాంట్రాక్టు పనిచేస్తుంటాడని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైస్‌మిల్లులపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

శంకరపట్నం, జూలై 6: శంకరపట్నం మండలంలోని తాడికల్ శివారులో గల రాజరాజేశ్వరి రైస్ మిల్లుపై శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2022-23 రబీ సీజన్, 2023-24 ఖరీఫ్ సీజన్, రబీ సీజన్‌లకు సంబందించిన 3.24లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తనిఖీ చేశారు. 673 క్వింటాళ్ల ధాన్యం తక్కుగా ఉన్నట్లు గుర్తించారు. నెల రోజులలో 673 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించి , వారి వద్ద నుంచి అండర్ టేకింగ్ లెటర్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్ష్మారెడ్డి, జగిత్యాల డీఎం అర్తిరామ్, నయాబ్ తహసీల్దార్ రమేష్‌బాబు, ఏఎస్ఐ సుధాకర్, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్ శ్రీనునాయక్, డీటీసీ వేణు తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూలై 6: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భారీగా తరలివచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

నరసింహుని సన్నిధిలో జిల్లా అడిషనల్ జడ్జి పూజలు

నరసింహస్వామి దేవాలయాన్ని జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ శనివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ జడ్జికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు బహూకరించి ఆయనను సత్కరించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆలయ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు అశ్విన్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

హోటల్స్, రెస్టారెంట్లలో విస్తృత తనిఖీలు

జగిత్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటల్స్, రెస్టారెంట్లు, ప్రభుత్వ, ప్రయివేటు వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో శనివారం ఆహార కల్తీ నిరోధక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. సీడ్ పాయింట్, పబ్ రెస్టారెంట్, సుప్రబాత్ రెస్టారెంట్ తదితర రెస్టారెంట్లు, హోటల్స్‌లలో శాంపిల్స్ సేకరించారు. పట్టణ శివారు ప్రాంతంలోని నూకపల్లి వద్ద కన్నయ్య డాల్ అను వ్యక్తి నిర్వహిస్తున్న బాంబే బేకరీలో తనిఖీలు చేశారు. బేకరీలో నిబంధనలకు విరుద్ధంగా రస్క్, ఫ్యామిలీ బిస్కట్, కేక్‌లను తయారీ చేస్తున్నట్లుగా గుర్తించారు. బేకరీపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష మాట్లాడుతూ పలు రెస్టారెంట్లు, హోటల్స్‌లలో తనిఖీలు చేసి శాంపిల్స్‌ను సేకరించామని, సంబంధిత శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



బేకరీలో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్స్‌పెక్టర్

క్షౌరశాలలకు 250 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

గణేశ్‌నగర్,జూలై 6: క్షౌరశాలలకు గత ప్రభుత్వం 250 యూనిట్ల కరెంటు సబ్సిడీ ఇచ్చిందని దానిని కొనసాగించేలా చూడాలని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం టీజీ ఎన్‌పిడిసిఎల్ ఎస్ఈ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ కరీంగనర్ జిల్లాలో సుమారు 2500 వరకు సెలూన్ షాపులు ఉన్నాయన్నారు. నాయీ బ్రాహ్మణ సెలూన్లకు, రజకులకు కూడా గత ప్రభుత్వం మాదిరిగానే సబ్సిడీ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కరెంటు సిబ్బంది సెలూన్ల బిల్లు కట్టాలని లేకుంటే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సబ్సిడీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ సిబ్బంది నాయీబ్రాహ్మణులను, రజకులను విద్యుత్ బిల్లులు చెల్లించాలని వేధించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలం మొండయ్య నాయీ,జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల జయరాం నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయి,నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్ నాయీ, సంఘం సభ్యులు తదితారులు పాల్గొన్నారు.

కళాభారతి.. ఏమిటీ పరిస్థితి

● శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కళాభారతి పక్కన చెత్తా చెదారం



అసంపూర్తిగా మినీ ఆడిటోరియం

కరీంనగర్ కల్చరల్, జూలై 6: ఘన చరిత్ర ఉన్న కళాభారతి నేడు అధ్వాన స్థితికి చేరింది. ఊడిన పై కప్పు పెచ్చులు... విరిగిన కుర్చీలు.. కుంగిన వేదిక.. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా మారింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి కరీంనగర్ వచ్చినప్పుడు అన్ని హంగులతో కలెక్టరేట్ హెలీప్యాడ్ ఆవరణలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.15 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదలయ్యింది. టెండర్లకు ఆహ్వానించకపోవడంతో అటు పాత కళాభారతికి మోక్షం దక్కక, కొత్త ఆడిటోరియం నిర్మాణ పనులు మొదలుకాలేదు. 2005లో ఎస్సారార్ కళాశాల ఆవరణలో కళాభారతికి ప్రత్యామ్నాయంగా నిర్మించతలపెట్టిన మినీ రవీంద్రభారతి కలగానే మిగిలిపోయింది.

● ఇదీ చరిత్ర...

1974లో కళాభారతిని నిర్మించారు. అప్పుడు టౌన్‌హాల్‌గా పిలిచేవారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కేఎస్ శర్మ కళాభారతి అని పేరు పెట్టారు. అనంతరం వెనుక భాగంలో ఆడిటోరియం నిర్మించారు. 2005లో మినీ రవీంద్ర భారతిగా అప్‌గ్రేడ్ చేసేందుకు సెంట్రల్ స్కీం కింద రెండు కోట్ల నిధులు కేటాయించారు. తొలి విడత 25 లక్షలు ఇవ్వగానే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. తర్వాత నిధులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ మంచి కళాక్షేత్రం కోసం అప్పటి సీఎంతో మాట్లాడుతామని అన్నారు. అది సాకారం కాలేదు. క్రమక్రమంగా కళాభారతి శిథిలావస్థకు చేరుకుంది.



కరీంనగర్‌లోని కళాభారతి



నిరుపయోగంగా మారిన కళాభారతి

చెట్లు నరికిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని వేంపేట శివారులో గుర్తు తెలియని రైతులు విచక్షణారహితంగా చెట్లను నరికివేయడంతో మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. గ్రామ శివారులో ఉపాధిహామీ పథకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన 150 చెట్లను ఈనెల 1న గుర్తు తెలియని రైతులు నరికివేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెట్లు విచక్షణారహితంగా నరికివేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు వ్యవహరించిన తీరుపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మండలంలో చర్చించుకుంటున్నారు. చెట్లు నరికిన విషయంపై సాకులు చెప్పి దాటవేయడం మంచి పద్ధతి కాదని, ప్రభుత్వ అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని సూచించి చెట్లు నరికి వేసిన వారిపై ఫిర్యాదు చేయాలని హెచ్చరించినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శి మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

మెట్‌పల్లి రూరల్, జూలై, 6 : మండలంలోని బండలింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో లవంగ భావన అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మరిపెల్లి కార్తీక్ శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ అండర్ 12లో 100 మీటర్ల పరుగు పందెంలో భావన ప్రథమ బహుమతి గెలుపొంది మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు నిర్వాహకులు మొదటి స్థానంలో నిలిచిన లవంగ భావనను ఎంపిక చేశారు.




లవంగ భావన

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన భావనను ప్రధానోపాధ్యాయుడు జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు. పాఠశాల పేరు నిలపాలని భావనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా ఉండాలి

● గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 6 : జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల అధికార యంత్రాంగం సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరముందని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి ఒక మాసం వేతనం ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న అయిదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల బదిలీపై వెళ్లిన అధికారులను యథాస్థానానికి బదిలీ చేయాలని, సమాన నిష్పత్తి చందాతో ఆరోగ్య పథకం అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీ కాలయాపన జరుగుతున్నందున అయిదు శాతం ఐఆర్‌ను ఇరవై శాతానికి పెంచాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్, నాయకులు కందుకూరి రవి బాబు, గణేష్, బద్దం రాజేందర్ రెడ్డి, అత్తినేని శ్రీనివాస్, నలీం, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ అంజిత్ రెడ్డి, విజేందర్, ఎ. శ్రీనివాస్, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 7 రోజులు, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 33,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు పాటించి వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు.

కూలిన కాకతీయ కాల్వ రక్షణ గోడలు

● మరమ్మతులు చేపట్టని అధికారులు
● భయాందోళనలో వాహనదారులు

మానకొండూర్, జూలై 6: కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై మండలంలోని పోచంపల్లి గ్రామ శివారులో కాకతీయ కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతులు చేపట్టం లేదు. దీంతో వాహనదారులు భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట 45 కిలోమీటర్లు నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి రోజూ కరీంనగర్ నుంచి జమ్మికుంటకు, ఊటూర్‌కు ప్రతి అరగంటకు ఒక్క బస్సు చొప్పున ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా డీబీఎం-6 ప్రధాన కాల్వ వంతెన రక్షణ గోడలు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. గతంలో కాల్వ వంతెనపై ఇసుక లారీ వెళ్తున్న సమయంలో వంతెన కుంగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. రాత్రి వేళల్లో వంతెన మీదుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు కాల్వలో పడిపోతామోనని భయాందోళనలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పోచంపల్లి వద్ద ప్రధాన రహదారిపై కూలిన కాలువ రక్షణ గోడ

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ధర్మపురి, జూలై 6: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాలను తిరిగి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం, మంత్రి, విప్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు అప్పం తిరుపతి, ఆశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్గటూర్: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామం చెగ్యాం నిర్వాసితులకు పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, చెగ్యాం నిర్వాసితులు శనివారం వెల్గటూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ల చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. చెగ్యాం ముంపు గ్రామంలో 126 కుటుంబాల వారు ఇళ్ల పరిహారం కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ చూపడంతో ప్రభుత్వం రూ.18 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. పదేళ్ల కల సాకారం కావడంతో నిర్వాసిత కుటుంబాల వారు హర్షం వ్యక్తం చేస్తూ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చెగ్యాం మాజీ ఎంపీటీసీ రంగు తిరుపతి, చెన్న పున్నం, బందెల ఉదయ్, సందీప్‌రెడ్డి, పూదరి రమేష్, గాజుల విజయ్, గోల్ల తిరుపతి, వెంకటేష్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ జూనోసెస్ దినోత్సవం

ధర్మపురి, జూలై 6: ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వెటర్నరీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసెస్ దినోత్సవం శనివారం నిర్వహించారు. ధర్మపురి మండల వెటర్నరీ డాక్టర్ బద్దం రాజేందర్‌రెడ్డి, డాక్టర్ జనగామ సునీల్ జంతువులు, మనుషుల మధ్య సంక్రమించే వ్యాధులు (జూనోటిక్) గురించి అవగాహన నిర్వహించారు. రేబిస్ వ్యాధి రాకుండా 58 పెంపుడు కుక్కలకు వెటర్నరీ శాఖ ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశామన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ పక్షాన అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య ఆధ్వర్యంలో డాక్టర్ రాజేందర్‌రెడ్డి, డాక్టర్ సునీల్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ ఇందారపు రామయ్య, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, కౌన్సిలర్లు, వెటర్నరీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో పశు వైద్య విభాగం, మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల అవగాహన దినోత్సవం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోర హన్మాండ్లు, 4వ వార్డు మాజీ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పిప్పోజి మహేందర్ బాబు, మేనేజర్ బి.వెంకటి, వెటర్నరీ సర్జన్ ఎ.శ్రీనివాస్, ఎల్ఎస్ఎస్‌లు ఖాలిక్, రాజ గంగారాం, గోపాల మిత్ర బి.అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.నరేష్, జూనియర్ అసిస్టెంట్ టి.హరీష్, వి.కిషన్‌లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అధికారి రమేష్ ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్‌లో జంతువుల వల్ల వచ్చే రేబిష్ వ్యాధి నివారణపై డాక్టర్ కృష్ణవేణితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిజాముద్దిన్, వైద్య సిబ్బంది ప్రభావతి, మహేశ్వరి, సూపర్ వైజర్ వసంత, ఏఎన్ఎమ్ హేమ, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నిర్మూలన

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్



ముత్యంపేటలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మల్యాల, జూలై 6: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నిర్మూలించవచ్చునని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ముత్యంపేటలో శనివారం వైద్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వలతో దోమలు వ్యాప్తి చెందిన మలేరియా, డెంగ్యూ తదితర రోగాలు ప్రబలే అవకాశం ఉంటుందని కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులకు ఆర్థిక సహాయం

రూ.15 వేలు సమకూర్చిన ఎమ్మెల్యే



బాలుడికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కొడిమ్యాల, జూలై 6: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి కిషన్, పూజ అనే దంపతులు ఇద్దరూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందటంతో వారి కుమారుడు మణిదీప్ (6), కూతురు దివ్యశ్రీ(2) అనాథలయ్యారు. చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం రూ. 15 వేలు, రెండు నెలలకు సరిపడా వంట సరుకులను సమకూర్చగా శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, కొడిమ్యాల సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, తిప్పయ్యపల్లి మాజీ సర్పంచ్ మ్యాకల లత మల్లేశంయాదవ్, నాయకులు సాయి, మధు, బాలయ్య, కిషన్, స్వామి, రవి, ప్రతాప్, హరీష్ పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల ఆటాపాటా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల, జూలై 6: పట్టణంలోని మాస్త్రో జూనియర్ కళాశాల విద్యార్థుల ఆటాపాట అలరించింది. శనివారం పట్టణం ముక్క కల్యాణ భవనంలో నిర్వహించిన ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్, వివిధ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, బండి మహాదేవ్, ఎంఏ బారీ, దీపక్, బాలాజీ దామెందర్, నీలి శ్రీనివాస్, వెంకటేష్, రహీం, రాజేంద్రప్రసాద్‌లు విద్యార్థులు ఉత్తమ స్థానంలో ఉండే విధంగా విద్యలో రాణించాలని సూచించారు. వివిధ రంగాలలో రాణించిన విద్యార్థులను సన్మానించి అభినందించారు.

'జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు పాటుపడాలి'



జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కోరుట్ల: బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని పలు రాజకీయ పార్టీల నేతలు, వివిధ కుల సంఘ సభ్యులు, వివిధ శాఖల అధికారులు అన్నారు. జగ్జీవన్ రామ్ వర్థంతి సందర్భంగా అంబేడ్కర్ నగర్‌లోని ఆయన విగ్రహానికి స్థానిక పాలక వర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పూల మాల వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. బడుగు బలహీన వర్గాల అభ్యునతికి జగ్జీవన్ రామ్ చేసిన కృషి గొప్పదన్నారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో వర్థంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గడ్డమీది పవన్, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, పద్మ-రాజిరెడ్డి, నరేష్, సజ్జు, సత్యం, నాగభూషణం, అంబేడ్కర్ సంఘ నాయకులు కరుణాకర్, లచ్చయ్య, అశోక్, ప్రజాసంఘాల రాష్ట్ర కన్వీనర్ భాస్కర్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని పలు గ్రామాలలో డా. బాబు జగ్జీవన్ రామ్ వర్థంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కొంత రాజు-రాజం, కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన దేశ మొదటి ఉప ప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ వర్థంతి ఘనంగా జరిగాయి. జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మొలిగె శ్రీనివాస్, మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ మొలిగె సుదర్శన్, నక్క రవి, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

మల్యాల: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్థంతి సందర్భంగా మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు మారంపల్లి లక్ష్మణ్ నాయకులు రవీందర్, సంజీవ్, అజయ్, గంగాధర్, గంగరాజం, ప్రవీణ్, బీజేపీ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

పెగడపల్లి : సంఘ సంస్కర్త, దళిత నాయకుడు మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ వర్థంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దీకొండ మహేందర్, సుంకె దుర్గాప్రసాద్, బొమ్మెన స్వామి, రాజరత్నం పాల్గొన్నారు.

మెట్‌పల్లి : బాబు జగ్జీవన్‌రామ్ వర్థంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కమిషనర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రిగా బాబు జగ్జీవన్ రామ్ పని చేసిన సమయంలో కార్మికుల సంక్షేమం కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు. మున్సిపల్ డీఈ నాగేశ్వర్‌రావు, మేనేజర్ వెంకటలక్ష్మీ, ఆర్వో ఉమాదేవి, ఆర్ఐ అక్షయ్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, ముజీబ్ పాల్గొన్నారు.



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో...

గొల్లపల్లి : మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్ రామ్ వర్థంతి వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలువేసి నివాళులు ఆర్పించారు. సంఘం అధ్యక్షులు తాండ్ర కిరణ్, ఉపాధ్యక్షులు రాకేష్, తాజా మాజీ సర్పంచ్ నిశాంత్, నాయకులు కొమురయ్య, వేంకటేష్, గంగాధర్, మల్లేష్, శ్రీకాంత్, రాజయ్య పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తూరి స్వామి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు నాయకులు నిర్వహిం చారు. వారు జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ని వాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆనందం, వెంకటేష్‌గౌడ్, తిరుపతి, రమేష్, మల్లేశం, చందు, శంకర్ పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడడంలో అందరి భాగస్వామ్యం అవసరం

● వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూలై 6 : ప్రకృతిని కాపాడడంలో అందరి భాగస్వామ్యం అవసరమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలు పునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని పోతారం లొంకరా మన్న ఆలయ శివారులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అటవీ సంపదను పెంచితే సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న అడవిని కాపాడుతూనే విస్తృతంగా మొక్కలు నాటి భావి తరాలకు సంపదను పెంచడానికి ప్రతీ ఒక్కరి కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. కన్న తల్లిలాంటి అడవిని కాపాడుకుంటే ఎన్నో లాభాలు ఉంటాయని చెప్పారు. అడవులను ధ్వంసం చేసే ప్రక్రియకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తోందన్నారు. ఇళ్లు లేని పేదలకు రు. 5 లక్షలు ఇచ్చి ఇళ్లు కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నట్టు తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లు నిర్మించే కార్యక్రమంతో పాటు రేషన్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 37 మందికి కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ ముం తాజీబోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో రాజేంధర్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మాజీ ఎంపీటీసీ పులి శిరీషహ రిప్రసాద్, కాయితి నాగరాజు, అజీం, చారి, దేవయ్య, ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.



మొక్క నాటుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బీర్‌పూర్: మండలకేంద్రంలో శనివారం ఎంపీడీవో లచ్చాలు ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వన మహోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని పల్లెప్రకృతి వనం సమీపంలో పలు విధములైన పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి గంగారాం, బీట్ అధికారులు శ్రీనివాస్, రాజేశం, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, కార్యదర్శి శిరీష, అంగన్‌వాడీ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన జువ్వాడి

కోరుట్ల, జూలై 6 : రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిసారు. హైదరాబాదులోని సచివాలయంలో మంత్రి నాగేశ్వర్ రావును తన చాంబర్‌లో కలిసి స్థానికంగా పార్టీ పరిస్థితితో పాటు కోరుట్ల నియోజకవర్గంలోని మార్కెట్ యార్డుల పరిస్థితిలను వివరించి నూతన నియమాకాల విషయాన్ని వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

వెటర్నరీ డాక్టర్లను సన్మానించిన ఉపాధ్యాయులు

కోరుట్ల రూరల్, జూలై 6 : ప్రపంచ జంతు సంక్రమిత వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో మాదాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో వెటర్నరి వైద్యులను ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు. మాదాపూర్ సెక్టార్ వెటర్నరి డాక్టర్ హిమజ, కోరుట్ల సెక్టార్ డాక్టర్ దీరజ్‌లను పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు బాజోజీ శ్రీనివాస్, కంటాల నవీన్ అంజాగౌడ్‌లతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

మల్యాల ఎస్సై-2గా రాజు

మల్యాల, జూలై 6: మల్యాల ఎస్సై-2గా కె.రాజు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లోకేశ్వరం, కడెం పోలీస్ స్టేషన్‌లలో ఎస్సైగా విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ అశోక్ కుమార్, సీఐ నీలం రవిలను కలిశారు. ఇక్కడి ఎస్సై-2 కుమారస్వామి బీర్‌పూర్ ఎస్సైగా బదిలీ కావడంతో రాజు ఎస్సై-2గా భాత్యతలు చేపట్టారు. ఎస్సై అబ్దుల్‌రహీం అభినందించారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, జులై 6 : అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నా రులకు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులు, బాలింతలు సద్వినియోగం చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్

మల్లాపూర్, జూలై, 6 : గుడుంబా తయరు, విక్రయాలు, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని వివిరావుపేటలో రహస్యంగా గుడుంబా తయారు చేస్తున్న స్థావరాలపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, జిల్లా సూపరిండెంట్ సత్యనారాయణ సూచనల మేరకు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. గుడుంబా తయారు చేయడానికి సిద్ధం గా ఉంచిన 250 లీటర్ల బెల్లం పాకం, తయారు చేయడానికి ఏర్పాటు చేసిన సామగ్రిని ధ్వంసం చేసారు. అక్కడే ఉన్న 6 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకోని తరు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గుడుంబా, నాటు సారా తయారు చేసి న విక్రయాలు, సరఫరా చేసిన ఎవరిని ఉపేక్షిం చేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్, సిబ్బంది, పాల్గొన్నారు.

'అమ్మ పేరుతో మొక్క'ను ఆదర్శంగా తీసుకోవాలి

● బీజేపీ నేత వికాస్‌రావు

కథలాపూర్, జూలై 6 : శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాస్ దివస్ సందర్భంగా అమ్మ పేరుతో మొక్క అనే కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు కోరారు. మండలంలోని పోతారం, అంబారిపేట గ్రామాల్లో దేశ ప్రధాని ఇచ్చిన పిలుపులో భాగంగా మొక్కలు నాటారు. అటవీ సంపదను పెంచడానికిగాను ప్రధాని పిలుపు ఇచ్చినే నేపథ్యంలో విస్తృతంగా మొక్కలు నాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, ధర్మపురి జలందర్, మల్యాల మారుతి, కాశోజి ప్రతాప్, బండ అంజయ్య, బద్రి సత్యం, మంగళి మహేశ్, పిడుగు ఆనందరెడ్డి ఉన్నారు.



పోతారంలో మొక్కలు నాటుతున్న వికాస్‌రావు

మొక్కలు నాటి సంరక్షించాలి

మల్లాపూర్ : గ్రామాల్లో ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో నాయకులతో కలిసి మొక్కను నాటి నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి పురస్కరించుకోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకొచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ క్లీన్ ఇండియా, హెల్త్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలి, వాటిని సంరక్షిం చాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రకృతిని కాపాడు కోవాల్సిన బాధ్యతగా ప్రతి ఒక్కరు భావించి మొక్కలను తప్పకుండా నాటేం దుకు యువత, మహిళలు, విద్యార్థులు ముందుండాలన్నారు. మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు అశ్విన్ నేతృత్వంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నాయకుల పూల మాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, నాయకులు గడ్డం నర్సారెడ్డి, ఎర్ర రాజు, ముద్దం సత్యనారాయణగౌడ్, ముత్యాల గంగరాజం, మొరపు జలపతి, బండి స్వామి, కళ్లెం శ్రీనివాస్, ఇల్లేందుల మనోజ్, ముస్కర్ రాజ్‌కుమార్, అంజమ్మ, సత్తెమ్మ, బుచ్చక్క, గొట్టిపాడుతా చింటూ పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఘనంగా బోనాల పండుగ

జగిత్యాల అర్బన్, జూలై 6: పట్టణంలోని శివవీధిలో గల అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. శనివారం పాఠశాలలో పండుగల పట్ల ఉత్సాహం పెంపొందించే విధంగా అల్ఫోర్స్ బోనాల జాతర జరిపారు. ఉత్సవాల ప్రారంభానికి ముందు మహంకాళీ మాతకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ అత్యంత ప్రీతికరమైందన్నారు. ఎన్నో తరాల నుంచి అవలంభిస్తున్న ఈ ఘనమైనటువంటి సాంప్రదాయం నేటికి ఎటువంటి లోటు లేకుండా కొనసాగించడం చాలా శుభపరిణామమన్నారు. మహిళలకు అత్యంత ఆరాధ్యమైన బోనాల పండగ అని, బోనాలను ఎత్తుకోవడం ద్వారా ఇండ్లలో ఆయురారోగ్యాలతో పాటు శుభఫలాలు సిద్దిస్తాయన్న ప్రగాఢ విశ్వాసం ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన 'ఓ తల్లి మైసమ్మ, పోచమ్మ, తెల్వామమ్మ నీకు బోనం...బోనమే మా దైవం' అంటూ చేసిన నృత్యాలు ఆకర్షింపజేశాయి. పలువురు విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి బోనాలను ఎత్తుకొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు.

ప్రత్యేకంగా పోతు రాజు వేషధారణలో విచ్చేసిన చిన్నారులు చేసిన విన్యాసులు చాలా అబ్బురపరచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

విద్యార్థులకు నోటుబుక్స్ అందజేత

మెట్‌పల్లి రూరల్, జూలై 6: మండలంలోని మేడిపల్లి, రాజేశ్వర్‌రావుపేట, సత్తక్కపల్లి గ్రామాలలోని ప్రభుత్వం పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌ను నాయకులు, ఉపాధ్యాయులు అందజేశారు. శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 116 పేద విద్యార్థులకు ఉచితంగా సంవత్సరానికి సరిపడా నోటుబుక్స్, స్టేషనరీలను అందజేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న 941 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్స్, స్టేషనరీలను అందించడం జరిగిందన్నారు. పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌ను అందజేసిన ట్రస్ట్ సభ్యులను ఉపాధ్యాయులు, నాయకులు అభిందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రెండో జత యూనిఫాం వేగంగా పూర్తి చేయాలి

డీఆర్‌డీవో సంపత్‌రావు

కథలాపూర్, జూలై 6: పాఠశాల విద్యార్థులకు రెండో జత యూనిఫాం కు ట్టడం వేగంగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో సంతప్‌రావు సూచించారు. మండ లంలోని సిరికొండలో శనివారం కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 4051 మంది విద్యార్థులకు ఈ మాసాంతం లోపు దుస్తులు కుట్టించి ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళలు నిర్దీత లక్ష్యం పూర్తి చేయడానికి ప్రయత్నించాలన్నారు. మండలంలోని నాలుగు కేంద్రాల్లో దుస్తులు కుట్టే ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏపీఎం నరహరి, సీసీ రాజు ఉన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రుద్ర శ్రీనివాస్

కోరుట్ల, జూలై 6: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రుద్ర శ్రీనివాస్‌ను నియమిస్తూ గంధమల్ల ఆనంద్‌గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. తన నియామకంకు సహకారం అందించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అనంద్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, నిజామాబాదు ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనను రాష్ట్ర స్థాయిలో నియామకం చేసినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

భీమారం, జూలై 6: తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం పలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన బొడ్డు చిన్న గంగారాం, దేశాయిపేట గ్రామానికి చెందిన ఉరుమడ్ల సతీష్, మద్రిపల్లి రాములు కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మొక్కలు నాటిన యువకులు

మల్యాల, జూలై 6: మల్యాల బ్లాక్ చౌరస్తా నుంచి పెగడపల్లి వెళ్లె మార్గంలో ఇక వైపుగా మామిడి మొక్కలను యువకులు నాటారు. మల్యాలకు చెందిన దొంతర వేణి శేఖర్ వంద మామిడి మొక్కలను సమకూర్చగా గ్రామపంచాయితీ అధికారులతో కలిసి శనివారం నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఈవో శ్రీకాంత్, ఈజీఎస్ సిబ్బందితో పాటు ఆర్మీ జవాన్ కీసరి గణేష్, సంకుర్తి సునీల్‌దత్తు, నీలం రవి పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

పెగడపల్లి, జులై 6 : భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను ఆ పార్టీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కూ డలిలలో ఆయన చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి డివైడర్‌లో పూలమొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు గంగుల కొమురెల్లి, నాయకులు చింతకింది అనసూర్య, సత్యం, బాబు, గట్టయ్య, కిషోర్, అంజి, పరుశరాం, బీరయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

రాయికల్, జూలై 6: రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా ఎంపీడీవో చిరంజీవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన జగదీశ్వర్ గౌడ్‌ను విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

రాయికల్, జూలై 6: రాయికల్ పట్టణంలోని డంపింగ్ యార్డును నూత నంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ బి.చిరంజీవి శనివారం పరిశీలించారు. బయో మైనింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలం కోసం సంబంధిత అధికారులతో కలిసి డంపింగ్ యార్డు పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట మేనేజర్ వెంకటి, ఏఈ సీవీ ప్రసాద్, బయో మైనింగ్ సంబంధిత అధికారులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేష్ ఉన్నారు.